# బ్రతుకు తెరువు

## యం.ఐ.కిషన్

"మింగు" అంటూ కంచాన్ని నిత్యానందం కేసి పెట్టింది సావిత్రమ్మ.

కిసుక్కున నవ్వింది నిత్యానందం చెల్లెలు నిర్మల.

ఆమె కేసి తినేసేలా ఓ చూపు చూసి మింగటం ప్రారంభించాడు నిత్యానందం.

నిత్యానందం నిరుద్యోగి. అతగాడు బియ్యే పాసై అయిదేళ్ళయింది. అప్పట్నుంచి ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు. అడ్డమైనవాడి కాళ్ళా పడుతున్నాడు. అయినా అతగాడికి ఉద్యోగం రాలేదు. ఆ కారణంగా అతడు తల్లిదండ్రులకు భారమైపోయిందే గాక, ఇంట్లో చులకనైపోయాడు.

గత రెండు మూడేళ్లుగా తండ్రి అతణ్ని పేరెట్టి పిలవడం మానేశాడు. "ఒరేయ్ పనికి మాలిన వెధవా!" అనో, "ఒరేయ్ అడ్డగాడిదా!" అనో ఇత్యాది ముద్దుపేర్లతో మాత్రమే పిలుస్తుంటాడు. అదైనా అతగాడితో ఎంతో అవసరం పడినప్పుడు మాత్రమే!

చెల్లెలు నిర్మల అతణ్ని చూసినపుడల్లా కారణం గీరణం ఏమీ లేకుండా కిసుక్కున నవ్వుతుంటుంది.

తల్లి ప్రేమ మహోన్నతమైనదంటారు. కానీ అదేం విచిత్రమోగాని తల్లికూడా అతగాడిని అసహ్యించుకోవడమే, గుడ్డి గుర్రానికి దాణావెయ్యడం దండుగన్నట్టు అతడికి భోజనం వడ్డించినపుడల్లా 'మింగు' అంటూనో, "కతుకు" అంటూనో బిచ్చగాడికి ముద్ద విదిలించినట్టు కంచంలో కూడేసి, సదరు కంచాన్ని అతడి ముందుకునెడ్తూ ఉంటుందావిడ.

నిరుద్యోగ రక్కసి కోరల నుండి బయట పడలేక పోతున్నందుకు నిత్యానందం నిత్యం క్షోభిస్తూనే ఉంటాడు. మనసులో కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ ఉంటాడు. కానీ ఏం లాభం? అతగాడిపైన ఆ భగవంతుడికి దయ కలగడం లేదు.

కంచంలో కన్నీటి బొట్లు రాలుస్తూ మింగటం పూర్తిచేసిన నిత్యానందం బ్రేవ్ మని తేన్చి, తడిచేతిని లుంగీకి రుద్దుకుంటూ "అమ్మా" అన్నాడు.

"ఏం నాయినా?" అన్నది సావిత్రమ్మ కంఠాన్ని వీలైనంత వ్యంగ్యంగా వొణికిస్తూ.

"బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ బోర్డువాళ్ళు ప్రకటన వేశారే! అప్లికేషన్ పెట్టడానికి పోస్టలార్డర్‌తో కలిపి ముప్పై అవుద్ది! నాన్నగారితో చెప్పవే..." చేతులు పిసుక్కున్నాడు నిత్యానందం.

"అప్లికేషన్లు పెట్టడానికి ఇంకోసారి గనక డబ్బులడిగితే మక్కెలిరగ్గొడ్తానని మొన్నేగా చెప్పేరు మీ నాన్న?'

"అందుకేగా నిన్నడగమంటున్నాను" దీనంగా చూశాడు నిత్యానందం.

"నే నడగను బాబూ! నాకుభయం! కావాలంటే నువ్వే అడుగు పోయి" అనేసి పెరట్లోకి వెళ్లిపోయింది సావిత్రమ్మ.

"నిర్మల కిసుక్కున నవ్వింది. నవ్వేక అంది నీలాంటి బుద్ధావతారాలు కాంపిటేటివ్ పరీక్షల్లో పాసవ్వరా అన్నాయ్! ఎందుకా వ్యర్థ ప్రయత్నాలు?! కొంపదీసి నాన్నగార్ని గాని అడిగేవ్... నిజంగానే విరగ్గొడ్తారు మక్కెలు!"

ఉండేలు దెబ్బ తగిలిన పక్షిలా విలవిల్లాడి పోయాడు నిత్యానందం. ఛీ... ఛీ... ఇంటిల్లిపాదికీ ఎంత చులకనైపోయాడు తాను?!

ఎందుకీ పాడు బ్రతుకు? ఎందులో నైనా దూకి ఛస్తే నయం!

నిన్నటికి నిన్న... సిన్మాకి... అదైనా నేల టికెట్‌కి... డబ్బులడిగితే ఎన్ని మాటలన్నాడు తన తండ్రి? "నీకు తిండి పెట్టడమే ధండుగ! ఇంకా నీ మొహానికి సిన్మాకూ్కడా ఒకటా?" అంటూ ప్రారంభించి... మాటల్ని ఈటెల్లా మార్చి వర్షంలా కురిపించాడు. ఈ నిర్మల ముండ నోట్లో పమిట చెంగు కుక్కుకుని ఒకటే నవ్వడం! ఏడుపొచ్చినంత పనైంది తనకి. తన మొహాన్ని చూసి, "ఎందుకోయ్ ఆడముండలా ఏడుపు ముఖం పెడతావ్?" అంటూ మరో చురకంటించాడు తండ్రి. ఆ అవమానాన్ని దిగ్రమింగుకోవడానికి తానెంత కష్టపడ్డాడో నిజంగా ఆ భగవంతుడికే తెలుసు!

నిరుద్యోగ రక్కసి కోరల నుండి బయటపడలేక పోతున్నందుకు నిత్యానందం నిత్యం క్షోభిస్తూనే ఉంటాడు. మనసులో కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ ఉంటాడు. కానీ ఏం లాభం? అతగాడిపైనభగవంతుడికి దయలేదు.

ఇంక లాభం లేదు. ఇంకా ఈ ఇంట్లో ఉండి ఈ అవమానాలను భరించడం ఇహ తనవల్ల కాదు.

పడాలి. ఎందులోనైనా పడి తీరాలి. ఈ నిరుద్యోగ నిప్పుల గుండం నుండి శాశ్వతంగా విముక్తి పొందాలి.

క్షణాల్లో ఓ నిర్ణయానికొచ్చిన నిత్యానందం చటుక్కున పేంటూ చొక్కా తొడుక్కుని ఇంట్లోంచి బయట పడ్డాడు.

** ** **

"ఎచటుకోయి నీ పయనం? ఏమిటోయి నీ గమ్యం?" దూరంగా ఎక్కడినుంచో ఏదో మైక్‌లో ఘంటసాలగారి కంఠం శ్రావ్యంగా వినవస్తోంది.

నిత్యానందం నడుస్తున్నాడు. ఊరుదాటి... ఏరుదాటి... గుట్టలుదాటి... పుట్టలు దాటి... కొండలు దాటి... డొంకలు దాటి... నడుస్తున్నాడు! ఒకటే పనిగా... పరుగులాంటి నడకతో నడుస్తున్నాడు.

నడిచి నడిచి నడిచి, ఒకచోట శోషొచ్చి పడిపోయాడు.

అతడు తిరిగి కళ్లు తెరిచేసరికి చిరుచీకట్లు కమ్ముకొస్తున్నాయి! ఒకింత దూరంగా వందలు... వేలు.. లక్షల సంఖ్యలో విద్యుద్దీపాలు! అంటే తను నడిచి నడిచి ఏదో మహానగరానికి వచ్చేశాడన్నమాట!

తాను పడివున్న ప్రాంతాన్ని (పరిసరాలను) పరికించి చూశాడు నిత్యానందం.

లక్షలాది మంది నిరుద్యోగులు కార్చిన కన్నీటి ప్రవాహంలా ఎదురుగా ఏదో నది! తను ఆ నది ఒడ్డున పడివున్నాడు!!

నిత్యానందానికి ఉన్నట్టుండి తన గతం గుర్తొచ్చింది. తను చచ్చిపోవాలన్న ఉద్దేశంతో ఇంట్లోంచి బయలుదేరాడు. మరి ఆ చచ్చేదేదో అక్కడే చావక, ఇంతదూరం ఎందుకు నడిచొచ్చినట్టబ్బా! — తనని తానే ప్రశ్నించుకున్నాడు.

అతడి ప్రశ్నకు అతడి మనసే సమాధానం చెప్పింది "తెలుగు సినిమాల్లో ఆత్మహత్య చేసుకోబోయే ముందు ఇలాగే వేలాది మైళ్ళు నడుస్తారు కదా? అందుకు!"

"ఓహో అందుకా?" అనుకుంటూ లేచి, ఓ మారు ఒళ్ళువిరుచుకుని, "జై భజరంగభళీ!" అని ఓ అరుపరిచి నదిలో దూకబోయాడు నిత్యానందం.

"ఆగు!" ఎవరిదో కంఠం ఖంగున మ్రోగింది.

ఆగేడు నిత్యానందం. అతడి భుజం మీద ఓ బరువైన హస్తం బలంగా పడింది! ఆ హస్తం నిండా పేడ!! "ఎందుకు బాబూ నదిలో దూకాలనుకుంటున్నావ్? దాంపత్య సుఖం అనుభవించ లేకపోతున్నావా? మగతనం లోపించిందని నిరాశా నిస్పృహలతో కృంగిపోతున్నావా? భయపడకు! నిన్ను నేను రక్షిస్తాను. ఓ వారం రోజులు నా దగ్గర మందుగాని తిన్నావంటే పురుషత్వం మూర్తీభవించిన మగ మహారాజువైపోతావు" అన్నాడు పేడ హస్తం తాలూకు శాల్తీ.

"నీ బొంద... అదేం కాదు... నన్ను చావనీ... అంటూ మళ్లీ దూకబోయాడు నిత్యానందం.

"నాకు తెలుసులే, చెప్పకోవడానికి సిగ్గుపడ్తున్నావ్ గాని, నువ్ నపుంసకుడివే! ఎందుకయ్యా చావడం?


నాదగ్గిర మందుందని చెప్పేనుగా? నే నెవర్ననుకుంటున్నావ్ విశ్వవిఖ్యాత సెక్స్ స్పెషలిస్ట్ కె.కె.ఆర్ ఆవ్ని..." అంటూ నిత్యానందం గింజుకుంటున్నా లెక్క చెయ్యకుండా అతగాడ్ని ఒడిసిపట్టుకుని కొంతదూరం లాక్కెళ్లి, అక్కడ క్రిందకొంగి ఓ పేడ తట్ట నందుకొని "నడువ్" అంటూ అతడ్ని ఓ కారుదగ్గిరికి నెట్టుకెళ్లాడు.

కారు దగ్గిర నిత్యానందాన్ని వెలుతుర్లో చూసిన పేడహస్తం తాలూకు శాస్త్రి అమాంతంగా ఎగిరి గంతేసి! "ఓర్నీ నువ్వట్రా నిత్తూ" అంటూ వాటేసుకున్నాడు.

పేడ హస్తం తాలూకు శాస్త్రికి పెద్దపెద్ద బుర్రమీసాలున్నాయి. అలాంటి శాస్త్రిని అంతకు ముందెన్నడూ చూసుండని నిత్యానందం "ఎవరయ్యా నువ్వు? నా ఒళ్లంతా పేడ పూసేస్తున్నావ్?" అన్నాడు కొరకొరా చూస్తూ.

"నన్ను గుర్తుపట్టలేదా? ఇప్పుడు వస్తావ్ చూడు..." అంటూ పేడ హస్తం తాలూకు శాస్త్రి తన పెట్టుడుమీసాల్ని తీసేశాడు.

ఈసారి నిత్యానందం ఎగిరి గంతేశాడు. "నువ్వట్రా కనకారావ్" అంటూ తను కూడా అతడ్ని వాటేసుకున్నాడు. "ఏంట్రా... ఈ పెట్టుడు



మీసాలేంటి? ఈ పేడ తట్టలేంటి?'' అనడిగాడు ఆశ్చర్యంగా (ఆనందం) నుండి తేరుకున్నాక.

''సంగతులన్నీ తీరుబాటుగా ఇంటికెళ్లాక మాట్లాడుకోవచ్చు. ముందు కారెక్కు'' అన్నాడు ఇంతసేపూ పేడహస్తం తాలూకు శాల్తీగా ఈ రచయితతో పేర్కొనబడిన కనకారావ్ ఉరఫ్ కె.కె.ఆర్.ఆవ్.

నిత్యానందం కారెక్కి పేడ తట్టల మధ్య ఇరుక్కుని కూర్చున్నాడు. కనకారావ్ స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. కారు కదిలింది.

''నా విషయం తర్వాత చెప్తాలే గాని, ముందు నీ సంగతి చెప్పు. నువ్వాత్మహత్య కెందుకొడిగట్టేవ్?'' డ్రైవ్ చేస్తూ అడిగాడు కనకారావ్.

తన విషాదగాథ నంతా పూసగుచ్చినట్లు వివరంగా చెప్పుకొచ్చాడు నిత్యానందం.

''ఓరి పిచ్చి సన్నాసీ! ఉద్యోగం దొరకనంత మాత్రాన బంగారం లాంటి ప్రాణాలు తీసుకుంటార్రా ఎవరైనా? నీ అదృష్టం బావుండబట్టి నడిచి నడిచి విజయవాడొచ్చి నా కళ్ళబడ్డావు గాబట్టి సరిపోయింది. లేకుంటే ఏమయ్యేవాడివి?'' అంటూ ముక్కు చీది, తన మిత్రుడూ కమ్ క్లాస్‌మేట్ అయినట్టి నిత్యానందం కేసి నీళ్లు నిండిన కళ్ళతో చూశాడు కనకారావ్.

కారు ఓ విశాలమైన బంగళా ముందు ఆగింది.

''ఈ బంగళా, ఈ కారూ నీవేనా?'' అడిగాడు నిత్యానందం కార్లోంచి దిగుతూ.

'నావే! ఏం... ఎందుకొచ్చిందా అనుమానం? ఓహో... చేపలు పట్టే రామయ్య కొడుకు బియ్యే అష్టకష్టాలు పడి పధ్నాలుగుసార్లు తప్పి పాసైన కనకారావ్ ఉన్నట్టుండి ఇంతవాడెలా అయ్యాడనేనా? అదిగో ఆ బోర్డు కేసి చూడు...''

చూశాడు నిత్యానందం:

ఆ విశాలమైన బంగళా ముందు ఓ విశాలమైన బోర్డు. దానిమీద గుమ్మడి కాయలంత అక్షరాల్తో ''ఆవూస్ సెక్స్ హాస్పిటల్'' అన్న హెడ్డింగ్ దాని క్రింద డా. కె.కె.ఆర్.ఆవ్, వైద్య మాణిక్య, సెక్స్ స్పెషలిస్టు అనే అక్షరాలు నారింజకాయలంత పరిమాణంలో మిలమిలా మెరుస్తున్నాయి.

సంగతి కొంచెం బోధపడింది నిత్యానందానికి.

''శత కోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు! ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం దొరక్కపోయేసరికి... ప్రాణం విసిగి... బాగా ఆలోచించి ఇలా సెక్స్ వైద్యుడిగా అవతారం ఎత్తేను. దేవుడి దయవల్ల నాలుగేళ్ళలో ఈ కారూ, ఈ బంగళా, ఓ రెండు లకారాలు క్యాషూ సంపాదించుకున్నాను'' అంటూ బంగళాలోకి దారితీశాడు కనకారావ్.

చాన్నాళ్ళ తర్వాత అనుకోకుండా కలిసిన మిత్రుడికి బ్రహ్మాండమైన ఆతిథ్యం ఇచ్చాడు కనకారావు. ఆ రాత్రి భోజనాలయ్యాక మిత్రులిద్దరూ తీరుబాటుగా మాటల్లోపడ్డారు.

''ఓరేయ్ కనకారావ్... నాకు తెలీకడుగుతాను... నువ్వీరకమైన వైద్యం ఎప్పుడు నేర్చుకున్నావ్‌రా? వైద్య మాణిక్య అంటే ఏంటి? అదేదైనా డిప్లొమోనా?'' అనడిగాడు నిత్యానందం నక్కపలుకు నములుతూ.

ఘొల్లుమని నవ్వాడు కనకారావ్. ''ఓర్నీ అమాయకత్వం నాశనం గానూ! ఈ అవతారం ఎత్తేనా బాబూ అని చెప్పినా కూడా నీకింకా అర్థం కాలేదా? అయితే వివరంగా చెప్తాను విను. నా కెలాంటి వైద్యమూ రాదు. వైద్య మాణిక్య అనేది నేను తగిలించుకున్న తోకే తప్ప డిప్లొమో కాదు, నా బొందా కాదు, ఆప్తమిత్రుడివి గనుక అసలు సంగతి చెబుతున్నాను. నేచేసేది వైద్యం కాదు హ్యూమన్ వీక్‌నెస్‌ని క్యాష్ చేసుకుంటున్నానంతే!''

''అంటే?'' అయోమయంగా చూశాడు నిత్యానందం.

''పేపర్లలో నా ప్రకటనలు చూసేవా ఎప్పుడైనా?''

రోజూ చూస్తూనే ఉంటాను. కానైతే కె.కె.ఆర్.ఆవ్ అంటే నువ్వనుకోలేదు...''

''అవున్లే... అనుకోనుండవు!... నా ప్రకటనల సారాంశం నీకు తెలుసుగదా? శీఘ్ర స్ఖలనం, నపుంసకత్వం ఇత్యాదుల్ని నేను శీఘ్రంగానూ మరియు గ్యారంటీగానూ బాగు చేస్తానన్నది ముఖ్యమైన పాయింటు. అవునా?... వయసు మళ్ళి దాంపత్యపరంగా తమ శక్తి సన్నగిల్లిందని భ్రమపడే వడికారు వాళ్లూ, ఏవో అర్థంపర్థం లేని భయాందోళనలతో మానసిక నపుంసకత్వాన్ని కొనితెచ్చుకున్న కుర్రకుంకలూ నా దగ్గరికి వస్తుంటారు సాధారణంగా. ఇచ్చేవాడి శక్తిని బట్టి డబ్బు గుంజి నేను వాళ్లకి ''మహా పురుష మధన లేహ్యం'' బాటిల్స్ ఇచ్చి పంపిస్తుంటాను. అంత ఖరీదైన మందుతిన్నాం గదా, తగ్గకపోతుందా అన్న ధైర్యం వాళ్లలో ఏర్పడి ఆ ధైర్యమే దివ్యవుషధంగా పనిచేసి . కొంతమందికి తమ డిజార్డర్ రెక్టిఫై అయిపోతుంటుంది. అదీగాక నేనుకూడా కొంత ధైర్యాన్ని నూరిపోసి పంపిస్తుంటాను కదా!? పోతే! కొందరి విషయంలో ఫలితం కనిపించదు. అలాంటి వారు మళ్ళీ మనజోలికి రారు...''

''మహాపురుష మదన లేహ్యం అంటున్నావ్ కదా, మరదెలా తయారుచేస్తావ్?'' కుతూహలంగా అడిగేడు నిత్యానందం.

''ఏముంది... వెరీ సింపుల్... పేడ, బంకమన్ను, కొంచెం చక్కెర... ఈ మూడిట్నీ కలిపి ఆబాటిల్స్‌లో నింపి లేబుల్స్ అంటిస్తే అదే అయిపోతుంది మహాపురుష మదన లేహ్యం!''

''ఛీ... ఛీ... పేడా, బంకమన్నులతోనా?..''

''అదంతేరా పిచ్చి సన్నాసీ! పేడ, బంకమన్ను ఫ్రీగా దొరుకుతాయి గాబట్టి నేను వాటినెన్నుకున్నాను. అలా ఫ్రీగా దొరికేవి ఇంకేవన్నా ఉంటే వాటితో కూడా చెయ్యొచ్చీ లేహ్యాన్ని. పోతే కాస్త రుచిగా ఉండటానికి చక్కెర మాత్రం కలిపి తీరాలి...'' అంటూ చిద్విలాసంగా నవ్వేడు కనకారావు.

''అయితే ఆ లేహ్యం నిజంగా ఔషధం కాదా?''

''ఇంత శుంఠవేంట్రా నువ్వు? ఇంత చెప్పేక కూడా ఇంకా అదేం ప్రశ్న? సెక్స్ స్పెషలిస్టుల దగ్గరి కెళ్లాంగదా, తగ్గిపోతుందిలే అన్న నమ్మకమే వాళ్లకు ఔషధం. నేనిలా పేడ, బంకమన్నులతో లేహ్యం చేస్తున్నానని ఎవరికైనా తెలిస్తే నా కొంప మునుగుతుంది కదా , అందుకని



## ముఖ్యమైనది

విజిటర్స్ వేళ అయిపోయిందని వెళ్ళి వెనక్కు తిరిగొస్తున్న రంగారావుని అడిగింది నర్సు ''ఏంటండి మళ్ళీ వస్తున్నారు?''


''నా భార్యకు ముఖ్యమైనదొకటి యివ్వటం మరచిపోయాను'' చెప్పాడు రంగారావు.

''నాకివ్వండి! ఆమెకిస్తాను'' అంది నర్సు.

రెండు నిమిషాలు తటపటాయించి రంగారావు నర్సును ముద్దు పెట్టుకొని. ''ఇదే మర్చిపోయింది'' అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

కె. సురేఖ (హైదరాబాద్)

## అనుమానాలు



## వ్యాసపీఠం

# మనస్సు— పతంజలి యోగదర్శనం

ఇద్దరు మిత్రులు సాయంకాలం వీధిలో కలుసుకొన్నారు. వారిలో ఒకడు "దేవాలయానికి రా పోదాం. అక్కడ భాగవత పురాణం చెబుతున్నారు. మనంకూడా విందాం పద" అని తన మిత్రుణ్ణి కూడా రమ్మని బతిమాలాడు.

"ఇప్పుడు దేవాలయానికి ఎందుకు? ఆడుకోడానికి మైదానానికి వెళదాం పద" అన్నాడు రెండవవాడు.

ఇద్దరికీ శ్రుతి కలవలేదు. ఒకడు దేవాలయానికి, ఇంకొకడు మైదానానికి తలవంచుకొని వెళ్లిపోయారు.

దేవాలయానికి వెళ్లిన యువకుడికి అక్కడ పురాణ ప్రవచనం ఏమాత్రం నచ్చలేదు. ఆ పురాణ కథలో కాస్తంతయినా అతడు చెవిని పెట్టలేదు. దేవాలయానికి వచ్చి ఆదివారం సాయంకాలం రెండు గంటలు వృథా చేసినందుకు విచారపడసాగాడు. అతని ధ్యానమంతా తన మిత్రునిమీద, ఆటలమీద, మైదానం మీదనే ఉంది.

రెండోవాడు మైదానానికి వెళ్లాడు. అక్కడ అతనికి తగిన మిత్రులెవరూ తటస్థపడలేదు. "అయ్యో! గుడికి వెళ్లి భాగవత పురాణం వినకుండా ఇక్కడికి వచ్చి సమయం వృథా చేశానుగదా!" అని పరితపించసాగాడు ఆ కుర్రవాడు. అతని ధ్యానమంతా దేవాలయంలోని శ్రీకృష్ణ విగ్రహంమీద, పురాణ శ్రవణం మీదనే ఉంది.

రెండు గంటల తర్వాత ఆ ఇద్దరు మిత్రులు ఆ త్రోవలో మళ్లీ కలుసుకున్నారు. గుడికి వెళ్లనందుకు వారిలో ఒకడు తన విచారాన్ని ప్రకటిస్తే



మరొకడు మైదానానికి వెళ్లనందుకు తన పరితాపాన్ని వెల్లడించాడు.

వారిద్దరి శరీరాలున్నచోట వారి మనసులు మాత్రం లేవు. మనసు పరిపరివిధాలుగా సంచరిస్తుంటుంది. అసలు మనస్సంటే ఏమిటి? ప్రమాణం, మిథ్యాజ్ఞానం, కల్పన, నిద్ర, స్మృతి ఈ అయిదు లక్షణాలు కలది మనస్సు అని తేల్చి చెప్పాడు పతంజలి మహర్షి యోగశాస్త్రంలో.

మనస్సు చంచలమైనది చాలా ప్రమాదకరమైనది కూడా. దాన్ని నిరోధించడం చాలా కఠినం. అయినా శాస్త్రకారులు మనస్సును నిరోధించడానికి ఎన్నో ఉపాయాలు చెప్పారు.

ముందుగా మనసును వశపరచుకొనకపోతే దాన్ని నిరోధించడం అసాధ్యమవుతుంది. మనసుకు పవిత్రత, పరిశుద్ధత లేకపోతే దాన్ని వశం చేసుకొనడం కఠినమవుతుంది.

కాబట్టి మొదట మనస్సును పరిశుద్ధం చేసుకోవలసి ఉంది. మనశ్శుద్ధికి మహాత్ములు అనేక సాధనాలు చెప్పారు.

సజ్జనులతో స్నేహంచేయడం, దుఃఖితుల పట్ల దయచూపడం, పుణ్యాత్ములను చూచి హర్షించడం, పాపులపట్ల ఉదాసీనత వహించడం నేర్చుకుంటే మనలో ఉండే రాగద్వేషాదులు నశించి మనస్సు పరిశుద్ధమవుతుంది. మనస్సు పరిశుద్ధమయిన తర్వాతనే దానికి ప్రసన్నత కలుగుతుంది.

గీతలో కృష్ణ భగవానుడు "మనశ్శుద్ధికి ఆసక్తిని త్యాగం చేసి నీ విధిని నిర్వహించు" అని ఆజ్ఞాపించాడు. మహాత్ములందరు గీతోక్తినే పునశ్చరణ చేశారు. నిరభిమానంగా, నిస్స్వార్థంగా, సకల జీవుల హితవు కోరి సేవచేయడం అంతఃకరణ శుద్ధికి ఉత్తమమైన ఉపాయమని పెద్దలందరి అభిప్రాయం.

దీనికంటే కూడా గొప్పదైన ఉపాయమొకటుంది. అది హరినామ గుణ సంకీర్తనం. జ్ఞానంతోగానీ అజ్ఞానంతోగానీ వాసుదేవుని కీర్తించినవాని పాపం నీళ్లలో వేసిన ఉప్పులాగా కరిగిపోతుంది. హరినామం నిప్పులాంటిది. ఇష్టం లేకపోయినా నిప్పుమీద చెయ్యివేస్తే కాలుతుంది. అలాగే ఇష్టంలేకపోయినా హరినామం ఉచ్చరించినవాని పాపం పటాపంచలవుతుంది. నామ సంకీర్తనం మనిషిని సాధువుగా చేసి తీర్చిదిద్దుతుంది. పాపం నశించి, మనశ్శుద్ధి ఏర్పడుతుంది. ఏకాగ్రత లభిస్తుంది. క్రమంగా చిత్త చాంచల్యాన్ని నిరోధించగలుగుతుంది. ఇలా పరిశుద్ధమూ స్వాధీనమూ అయిన మనస్సు పరమానందానుభవానికి యోగ్యత సంపాదించుకొంటుంది.

అభివృద్ధి దశలో ఉన్నదాన్ని దేహమంటారు. క్షీణదశలో ఉన్నదాన్ని శరీరమంటారు. శరీరారోగ్యం కోసం మనమెన్నో సాధనలు చేస్తుంటాము. కాని పతనోన్ముఖమైన మనస్సును బాగు చేసుకోడానికి ప్రయత్నించము. పతంజలి మహర్షి రచించిన "యోగ దర్శనం"లో మనసుకు పట్టిన మాలిన్యాన్ని కడిగి వేసుకోటానికి ఎన్నో మార్గాలు కనిపిస్తాయి. *

---

చీకటిపడే వేళ నేనే స్వయంగా కారుమీద వెళ్లి క్రిష్టొడ్డున వాటిని కలెక్ట్ చేసుకొస్తుంటాను. ఈ వృత్తి రహస్యాలన్నీ నీ కెందుకు చెబుతున్నానో తెలుసా? నువ్వు కూడా నాలాగే ఈ బిజినెస్ పెట్టి పైకి రావాలన్న సదుద్దేశంతో. స్నేహితుడన్నాక కష్టాల్లో ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు... ఏమంటావ్?"

నిత్యానందం కళ్ళ వెంబడి ఆనంద భాష్పాలు జలజలా రాలేయి. "నిజంగా నీలాంటి స్నేహితుణ్ని పొందిన నేను ఎంత అదృష్టవంతుడిని రా!" అంటూ కనకారావుని కౌగలించుకున్నాడు.

"నాదొక చిన్న డౌటు... ఈ వ్యవహారంలో పోలీసుల్తో ఎలాంటి ట్రబులూ ఉండదా?

"ఎందుకుంటుంది!" మన దగ్గర కొచ్చేవాడు రావడమే సిగ్గుపడుతూ వస్తాడు. అలాంటిది పోలీసులకి రిపోర్టిచ్చేదెవడు? అదిగాక ఈ బిజినెస్‌లో బోలెడంత డబ్బు సంపాదించేసి మనం లక్షాధికారులం ఐపోతాంగా... ఇంకా పోలీసోళ్లు మనకేసి కన్నెత్తి ఎలా చూడగల్రు?

"నిజమే సుమా!" అనుకున్నాడు నిత్యానందం. మరి ఈ పెట్టుడు మీసాల సంగతేంటి?

"సెక్స్ స్పెషలిస్ట్‌కి అలాంటి మీసాలు కంపల్సరీగా ఉండి తీరాలి. పెద్ద పెద్ద మీసాలుంటే ఎలాంటి అల్పుడైనా గంభీరంగా కనిపిస్తాడు కదా... మన దగ్గరి కొచ్చే పేషంట్లకి మనం గంభీరంగా ప్రపంచంలో ఉన్న పురుషత్వమంతా మనలోనే ఉందేమోనన్న భ్రమ కల్గించేలా అగుపించాలి. అందుకే ఈ పెట్టుడు మీసాలు" అంటూ వృత్తి విద్యా బోధన ముగించాడు కనకారావ్.

మర్నాడు కనకారావు నిత్యానందం చేతిలో ఓ నాలుగొందలు పెట్టి, "నేటితో నీ నిరుద్యోగం గట్టెక్కి పోయిందిరా నిత్తూ! నువ్వింక మీ ఊరెళ్లిపో! మీ ఇంటి అరుగుమీద నాలాగే ఓ సెక్స్ హాస్పిటల్ ప్రారంభించు. నేను కూడా మొదట్లో అరుగు మీదే ప్రారంభించి ఈ స్థితికెదిగాను. నువ్ కూడా ఎదుగుతావ్... ఈ నాలుగొందలు పెట్టి ఒక చెక్కబల్ల, పాతిక సీసాలు, ఒక లాంగ్ బెంచ్!, ఒక బోర్డు ఇత్యాదులు సమకూర్చుకో... ఐ విష్ యు ఆల్ ది బెస్ట్!" అంటూ భుజం తట్టాడు.

కృతజ్ఞతా పూర్వకంగా మిత్రుడికి రెండు చేతులూ జోడించి తిరుగు ప్రయాణమయ్యాడు నిత్యానందం.

** ** **

నిత్యానందం ఇప్పుడు నిరుద్యోగి కాదు. వాళ్లింట్లో అందరూ అతడి ప్రయోజకత్వాన్ని ఎంతగా కొనియాడుతున్నారో చెప్పాలంటే ఇంకా ఇంతకింత రాయాల్సొస్తుంది. అసలే న్యూస్ ప్రింట్ కొరతగదా?... శెలవ్. *